# "భిన్నత్వంలో ఏకత్వం"

"ఇపుడు మీరు కాఫీ త్రాగుతున్నారా...."

"ఆ నిస్సందేహంగా కాఫీయే తాగుతున్నాను... టీ కాదని, హార్లిక్స్ అసలే కాదనీ ఘంటాపథంగా చెప్పగలను...."

"ఆఫ్ కోర్స్! అది కాఫీయే అనుకోండి కాని ఇంకో క్షణం తర్వాత మీరు దాన్ని త్రాగుతూ వుంటారని నమ్మకమేమిటి?"

"ఖచ్చితంగా త్రాగుతాను. అపనమ్మకం ఏమీ లేదు!"

"అహ! అది కాదు! జీవితం క్షణభంగురంబు అన్నారు కదా..."

"ఎవరన్నారు? నేనా?"

"మీరు కాదనుకోండి...."

"మా ఆవిడ కూడా అన్నట్టు నాకు జ్ఞాపకం లేదే..."

"మీ ఆవిడగారు కూడా అనకపోవచ్చు. కాని అది జగమెరిగిన సత్యం. ఇంకో క్షణంలో మనం ఏమయిపోతామో చెప్పలేం!"

క్షణంసేపు నిశ్శబ్దం!!

"చూశావా? క్షణం గడిచిపోయింది. నేను కాఫీ త్రాగుతూనే వున్నాను. నువ్వు గొర్రెలా నావేపు చూస్తూనే వున్నావు. ఇప్పుడేనా ఒప్పుకుంటావా జీవితం క్షణభంగురంకాదని!"

"మీరెన్ని చెప్పండి, రేపు అనేది మనచేతిలో వుందంటే ఒప్పుకోను. ఈ సందర్భంలో మీకో చిన్న కథ చెప్పాలి"

"ఏమిటది? కొంపదీసి సినిమా కథా?"

"కాదు! మన పురాణ కథే! ఓసారి ధర్మరాజు నిండుసభలో వుండగా ఓ యాచకుడు వచ్చేడట. దానం అడిగితే 'రేపు రా' అన్నాడట ధర్మజుడు. వెంటనే భీముడు అమితోత్సాహంతో ఎగిరిగంతేశాడట! సైన్యాన్ని పిలిచి పెద్ద ఎత్తున వేడుకలు జరిపించమన్నాడు! ప్రజలందరినీ పండగ చేసికొమ్మని ఆదేశించేడు! తమ్ముని ప్రవర్తన ధర్మజునికి అర్థంకాలేదు. భీముణ్ణి పిల్చి "ఏమిటిదంతా;" అని అడిగేడట. భీముడు అతి వినయంతో అన్నగార్కి నమస్కరించి, మీరు ఆ యాచకుడిని రేపు రమ్మన్నారు అంటే, రేపటివరకూ మీరు ఖచ్చితంగా బతికివుంటారని నమ్మకమే కదా! జీవితం క్షణభంగురం అని తెల్సినా మీరంత ఖచ్చితంగా, నమ్మకంగా చెప్పేరంటే మీ తమ్ముడినయిన నాకు అంతకంటె వేరే ఆనందం ఏమిటుంటుంది? ప్రజలకు కూడా అతి చాలా ఆనందదాయకం కాదా?" అన్నాడుట.

ధర్మరాజు తన తప్పిదం తెల్సుకుని సిగ్గుపడి వెంటనే యాచకుని పిలిపించి అతనికి కావల్సినవి ఇచ్చి పంపేడుట! అందుకని మనం చేయదల్చుకున్న మంచిపనులు ఏవయినా వుంటే వెంటనే చేసెయ్యాలి!"

"కథ చాలా బాగుందోయ్! ఇంతకీ నువ్వు చెప్పదల్చుకున్న విషయం కాస్త వివరంగా చెప్పు"

"చెప్తాను వినండి! మీకు ముగ్గురు పిల్లలున్నారా? ఒక భార్యగారు ఉన్నారా? అనుకోకుండా మీకు ఏమయినా ప్రమాదం జరిగితే వాళ్ల గతి ఏంకాను? వాళ్లకు భవిష్యత్తులో భద్రత ఏముంది? మనం చెడుజరగాలని కోరుకోం! కాని మనం కోరనంతలో జరక్కమానదు కదా!..."

"వెరీ గుడ్! చాలా బాగా చెప్పేవు! అయితే ఈ విషయాన్ని నువ్వు నమ్ముతున్నావా?"

"ఎంత మాట! మనసా వాచా నమ్ముతున్నాను కాబట్టే మీకు చెప్పగల్గుతున్నాను"

"నీకు పిల్లలెలంతమంది?"

"ఇద్దరు!"

"భార్యలు?"

"ఆఫ్ కోర్స్! ఒక్కళ్లే!"

"నీ ఒక భార్యకూ, ఇద్దరి పిల్లల భవిష్యత్తుకూ నువ్వు హామీ ఇవ్వాలా, అక్కరలేదా?"

"తప్పక ఇవ్వాలి సార్!"

"ఒకవేళ భవిష్యత్తులో ఇంకా పిల్లలు పుడితే వాళ్లకు కూడా ఇవ్వాలి కదా!..."

"ఇహ ఆ ప్రమాదం లేదులెండి!"

"ఓహో! ఆపరేషను చేయించావన్నమాట! వెరీగుడ్! ఈ విషయాన్ని నువ్వింత కూలంకషంగా ఆలోచించి నమ్మేవు కాబట్టి నా పని మరింత సులువయింది! నా దగ్గర ఓ ఇరవై వేల రూపాయలకు ఇన్స్యూరెన్సు పాలసీ తీసుకో!"

"చంపేరు సార్! మీకూ ఏజెన్సీ వుందేమిటి? నేనూ ఏజెంటునే! మీ దగ్గర పాలసీ తీసుకుందామని నేను వచ్చేను... మరి నేను వెళ్ళొస్తాను సార్!"

"శుభం! వెళ్ళిరా!" ★

(యువ దీపావళి సంచిక 1976)